రోహింగ్యాలపై చర్యలు తీసుకోండి

● కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి అందెల వినతి


బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను ఇక్కడి నుంచి పంపించేయడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కోరారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల తన ఇంటి వద్ద రోహింగ్యాలు రెక్కీ నిర్వహించిన అంశాన్ని ఆయనకు వివరించారు. బాలాపూర్ మండలానికి శరణార్థులుగా వచ్చిన రోహింగ్యాలు అక్రమంగా ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందుతున్నారని, వాటి ఆధారంగా సిమ్ కార్డులు తీసుకుని దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆయన వివరించారు. ఆయా కార్డులను మంత్రి సంజయ్‌కి శ్రీరాములుయాదవ్ అందజేశారు. అనంతరం బండి మాట్లాడుతూ సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి రోహింగ్యాలను ఇక్కడి నుంచి తరలించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, తుక్కుగూడ మునిసిపల్ మాజీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ దిశా కమిటీ మెంబర్ అంబోజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రూ. 6వేల పెన్షన్ ఇచ్చేలా ఒత్తిడి పెంచండి'

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సొసైటీ ఆఫ్ లెప్రసీ బాధిత సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేష్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్‌ను వెంటనే అమలు చేసేలా తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామ్యేల్, డోమినిక్, ఆకాశ్, తదితరులు ఉన్నారు.

ఘన వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన

హయత్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం తుర్కయంజాల్‌లోని లోటస్ ల్యాప్ పాఠశాలలో ఘన వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్‌ను వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో మహిళా సంఘాల పాత్ర గొప్పదని అన్నారు. మున్సిపాలిటీలో సేకరించిన ఘన పదార్థాలను స్టేషనరీ వస్తువులుగా తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు వినయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ

చాదర్‌ఘాట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, దారిషిఫాలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు నగౌర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాగ్‌లు, కుర్చీలు పంపిణీ చేశారు. అంధ విద్యార్థుల కోసం ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. సైదాబాద్ మండలం డిప్యూటీ ఈవో రాధాకృష్ణ, నగౌర చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రావు, సభ్యులు వి.వెంకట్‌రావు, ఎస్.నాగేశ్వర్‌రావు కలిసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలం ఉప పర్యవేక్షణాధికారి వరప్రసాద్‌రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డి, గుమ్మడపు అంజనేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): వ్యాపారసముదాయాల్లో, షాపుల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీలను, నేరాలను కొంతమేర అరికట్టవచ్చని మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ట్రేడర్లు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశనికి ఏసీపీ హాజరై మాట్లాడుతూ మార్కెట్ నలువైపులా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్‌సింగ్, మాదారం కృష్ణ ట్రేడర్లు, వ్యాపారలు మార్కెట్ సిబ్బంది, తదితరలు పాల్గొన్నారు.

'భారీ వృక్షాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి'

వనస్థలిపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఏలాంటి అనుమతులు తీసుకోకుండా 20 ఏళ్ల భారీ వృక్షాన్ని తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ రెంజ్ అధికారి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త, సెంటర్ ఫర్ సోషయో కల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ సంస్థ కార్యదర్శి సన్ని హెరాక్లస్ తెలిపారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్‌లో ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా బీఎన్‌రెడ్డినగర్‌లోని ఆంధ్రబ్యాంకు ఎదురుగా ఉన్న రోడ్డులో డ్రైనేజీ పనుల కోసం రోడ్డును తవ్వారు. ఈ నేపథ్యంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాన్ని రాత్రికి రాత్రే సదరు వ్యక్తులు తొలగించి ఎలాంటి ఆనవాళ్లు లేకుండా చేశారని తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : యశశ్రీ

కొత్తపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రాణవాయువు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ యశశ్రీ తెలిపారు. కొత్తపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి కొత్తపేట- నాగోల్ దారిలో ర్యాలీ చేపట్టారు. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ యశశ్రీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం మానాలని సూచించారు. వనమహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులకు స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్ట్ అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. జాగృతి అభ్యుదయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భావన శ్రీనివాస్, గోపాల్‌దాస్ రాము, జీవనది ఫౌండేషన్ లక్ష్మీదుర్గ, స్వచ్ఛ భారత్ మిషన్ టీం మెంబర్ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకాళి ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కుర్మగూడలో మహాకాళి పోచమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయం(మూడు గుళ్ళు) 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకురాలు శ్రీదేవి చండీహోమం నిర్వహించారు. మాదన్నపేట, కుర్మగూడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాషచందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్తకాపు రవిందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సహదేవ్ యాదవ్, బర్ల శ్రవణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎల్ కాలనీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం


కొత్తపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎల్ కాలనీ పాత కార్యవర్గమే ఈ సారి మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మరోమారు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ కాలనీ కార్యవర్గం, ప్రతినిధులు కలిసికట్టుగా సమస్యలను గుర్తించాలన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు కుమార్, అశోక్‌చారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి వేణుగోపాల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం విజేత లోకేశ్వరికి సన్మానం

ఎల్బీనగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చెక్ రిపబ్లిక్ దేశంలో జూలై 1 నుంచి 6 వరకు వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఉమెన్స్ గ్రాండ్ ప్రిక్స్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీలలో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారిణి కుడుముల లోకేశ్వరి డిస్కస్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సరూర్‌నగర్‌లో లోకేశ్వరికి పౌరసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండు ధనమ్‌రెడ్డి, నరేష్, సుధాకర్, గోవర్ధన్‌రెడ్డి, ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ కోచ్ వేణు, అకాడమీ ప్రతినిధులు, సాగరిక, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపూర్ణిమ వేడుకలు

పూజా కార్యక్రమాల వివరాలను వెల్లడించిన సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు


సంస్థాన్‌లోని సాయిబాబా విగ్రహం

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

ఉత్సవాల మొదటి రోజు బుధవారం ఉదయం 6 గంటలకు ఘానగాపూర్‌లోని భీమ, అమరజ నదుల పవిత్ర జలాలతో బాబాకు మంగళస్నానం, 6.50 గంటలకు 108 బంగారు పుష్పాలతో సువర్ణపుష్పాలంకరణ, 9 గంటలకు భక్తులతో శ్రీసాయి నామార్చన, రాత్రి 7 గంటలకు శ్రీ గురు గీత, శ్రీ దత్తాత్రేయ వజ్రకవచం, శ్రీ సాయి చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.


గురుపూర్ణిమ పూజా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పాలకవర్గం సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షిరిడీ సాయి సంస్థాన్‌లో జూలై 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు గురుపూర్ణిమ ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించేందుకు సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సంస్థాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురుపూర్ణిమ మహోత్సవ పూజా కార్యక్రమాల వివరాలను సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ శ్యామ్‌కుమార్, ప్రధానకార్యదర్శి రఘుకుమార్, మాజీ చైర్మన్లు గుండా మల్లయ్య, వూర నర్సింహా గుప్తా, వనం యాదయ్య, ఉపాధ్యక్షులు పద్మాకర్ ఆత్రే, జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి సంస్థాన్ పరిసరాలలో చేపట్టాల్సిన భద్రతా చర్యలను పరిశీలించారు.

ప్రత్యేక క్యూలు.. రెండు ఎల్ఈడీలు

ఈ సంవత్సరం గురుపూర్ణిమ గురువారం రోజు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశాలున్నాయి. అందుకు తగ్గట్లుగానే సంస్థాన్ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బాబా దర్శనానికి వచ్చే చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. దాతల కోసం ఓ క్యూ, వీఐపీల కోసం మరో క్యూ ఇలా ఐదు రకాల క్యూలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అదే విధంగా క్యూలోనే మంచినీటి సరఫరా చేయనున్నారు. దాతలు పీఆర్‌వో కార్యాలయంలో సంప్రదిస్తే పాస్‌లు జారీ చేయనున్నారు. రెండు హెల్ప్ డెస్క్‌లు, రెండు పోలీస్ కంట్రోల్ రూమ్‌లు, రెండు మంచినీటి కేంద్రాలు, ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటల పాటు అంబులెన్స్ సంస్థాన్ వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. హారతి సమయంలో సంస్థాన్ లోపల ఉన్న భక్తులతో పాటు బయట ఉన్న వారు కూడా హారతి వీక్షించేందుకు వీలుగా సంస్థాన్ ప్రవేశద్వారం బయట ఒకటి, సంస్థాన్ ముఖద్వారం(ఆర్చ్) వద్ద ఒక ఎల్ఈడీని ఏర్పాటు చేస్తున్నారు.

గురుపూర్ణిమ రోజు 24 గంటలు దర్శనభాగ్యం

- గురుపూర్ణిమ రోజు గురువారం ఉదయం 5 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు దర్శనానికి అనుమితివ్వనున్నారు. అర్ధరాత్రి సమయంలో కూడా సంస్థాన్ తెరిచే ఉంచనున్నట్లు వివరించారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సంస్థాన్ వెనుక వైపు వీధిలో, మెగా థియేటర్ వెనుక గేటు వద్ద నిరంతరాయంగా అన్నదానం నిర్వహించనున్నారు. రాత్రి మొత్తం దర్శన సౌలభ్యం ఉన్న నేపథ్యంలో భక్తులు గుంపులు, గుంపులుగా కాకుండా వేర్వేరు సమయాల్లో దర్శనానికి రావాలని పాలకవర్గ సభ్యులు విన్నవించారు.
- గురుపూర్ణిమ రోజు ఉదయం 6గంటలకు 108 వెండి కలశములతో పవిత్రనదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అష్టోత్తర కలశాభిషేకం, మంగళస్నానం, 6.50గంటలకు 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్ప అలంకరణ, 9గంటల నుంచి శుక్రవారం ఉదయం 9గంటల వరకు 24గంటల పాటు సాయి నామ ఏకాహము ఉంటుంది.
- 11వ తేదీ శుక్రవారం ఉదయం 6.50 గంటలకు 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్ప అలంకరణ, 7.15 గంటలకు జీవిత కాల సభ్యులకు, నిత్యాన్నదాన పథకం సభ్యులకు అర్చన, వేద ఆశీర్వచనం, రాత్రి 7 గంటలకు బాబా రథోత్సవం, విశేష పల్లకి ఊరేగింపు కార్యక్రమాలుంటాయి.

అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తున్న బడంగ్‌పేట్ కమిషనర్

● మునిసిపల్ కార్యాలయం వద్ద బీజేపీ నేతల నిరసన


మునిసిపల్ కార్యాలయం చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సరూర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ సరస్వతి అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు ఆక్రమించిన వారికి అండగా నిలుస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆయా ఆక్రమణలపై తాము ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా బుట్టదాఖలు చేస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో కమిషనర్ పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. ఆమె 'కమీషన్ల కమిషనర్'గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కమిషనర్ వైఖరిని నిరసిస్తూ మంగళవారం పార్టీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట, అనంతరం కార్యాలయం చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాలలో కమిషనర్ సరస్వతి అవినీతిని ప్రోత్సహిస్తున్నారని, అభివృద్ధి పనుల టెండర్లలోనూ గోల్‌మాల్ చేస్తూ కొందరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి కమిషనర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలను పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు మల్లేశ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, కార్పొరేషన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

● సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి

వనస్థలిపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నేడు(బుధవారం) దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్, వెంకటేశ్వర కాలనీ, జక్కిడి నగర్‌లలో దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతా కార్మిక సంఘం నాయకులు కొత్త గణేష్‌గౌడ్, మహిళా నాయకురాలు తిరుమల సంధ్య, జంగయ్యగౌడ్, గిరీష్, సంతోష, సరిత, భిక్షపతి, లక్ష్మీనారాయణ, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో అన్ని రంగాల కార్మికులు..

అబ్దుల్లాపూర్‌మెట్; జూలై 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, నరసింహ, ప్రసాద్, రవి, ధూపం, నిరంజన్, సైదులుముదిరాజ్, సుధాకర్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్, తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలను హయత్‌నగర్, తుర్కయంజాల్‌లోని కార్మికులకు సీపీఐ, సీపీఎం, సీఐటీయూ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. హయత్‌నగర్ కార్మిక అడ్డా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్బీనగర్ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఓబీసీ జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్ పాల్గొని పెద్ద ఎత్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కుంట్లూర్ రోడ్డులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిసరి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఆటో స్టాండ్‌లో కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కిషన్ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో వివిధ రంగాల కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.


చిత్రా లేఅవుట్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, నాయకులు


అల్మాస్‌గూడలో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పారిజాతారెడ్డి, తదితరులు

జనహృదయ నేత వైఎస్ఆర్: దేప భాస్కర్‌రెడ్డి

● ఘనంగా జయంతి వేడుకలు

ఎల్బీనగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జనహృదయ నేత అని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని చిత్రా లేఅవుట్‌లోని వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఉపేందర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

● సరూర్‌నగర్: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో ఘనంగా నిర్వహించారు. అల్మాస్‌గూడలోని వైఎస్ఆర్ పార్కు వద్ద యూత్ కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంద మల్లమ్మ చౌరస్తా వద్ద వైఎస్ విగ్రహానికి టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నాదర్‌గుల్ బస్టాండ్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుడు వల్లపు సుభాన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, భాగ్యనగర్ రైతు సొసైటీ వైస్ చైర్మన్ బంగారు బాబు, కందాడి శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొని వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● సైదాబాద్: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నేతలు కీర్తి మంజుల, రాహుల్ మేరు ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

● చంపాపేట: హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెండి శశిదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి నాయకులు నర్సింహాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి హనుమాన్ దేవస్థానం ధర్మకర్త కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


హస్తినాపురం డివిజన్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, తదితరులు


కర్మన్‌ఘాట్ విలేజ్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, తదితరులు

నేడు పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి నేడు (బుధవారం) ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ సమత తెలిపారు. జోగులాంబ దేవాలయం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ (వెల్లూరు), అరుణాచలంకు వెళ్లే భక్తుల కోసం డీలక్స్ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. ప్రయాణికులు ఒక్కరికి చార్జీగా రూ.3,800 వసూలు చేస్తామని పేర్కొన్నారు.


యాదగిరికి నియామక పత్రం అందజేస్తున్న రాజయ్య, మధుయాష్కీ

ఆలయాలు ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయి

ఎల్బీనగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు దోహదపడతాయని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ఎల్బీనగర్ బహదూర్‌గూడలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌తో కలిసి రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ నూతన ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ధర్మకర్తలుగా తీగుళ్ల యాదగిరి, చెరుకు భవానీ శంకర్, సాయికుమార్, బాలకృష్ణ, పార్వతి, భరత్‌కుమార్ యాదవ్, జాలె వెంకట్‌రెడ్డి, దేవిక, ఉదయశ్రీ, స్వప్న ప్రమాణం చేశారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పక్క పక్కనే నివాసముంటున్న ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటన మంగళవారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఎర్రం వెంకటేష్ మేస్త్రి పని చేసుకుంటూ నివాసముంటున్నాడు. రమేష్ అనే వ్యక్తి వెంకటేష్ ఇంటి పక్కనే అద్దెకుంటున్నాడు. మంగళవారం రాత్రి వెంకటేష్ ఇంటిపై రమేష్ రాయి విసిరాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్ళిన తర్వాత వెంకటేష్ వాకింగ్ కోసం బయటికి వచ్చాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న రమేష్ కత్తితో వెంకటేష్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటేష్ చేతికి, షోల్డర్ కనుబొమ్మలపై గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

ఎల్బీనగర్‌లో 1,182 గ్రాముల గంజాయి పట్టివేత

● ఇద్దరు నిందితుల అరెస్ట్

కొత్తపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలో మంగళవారం గంజాయిని విక్రయించే ప్రయత్నం చేస్తున్న ఇద్దరు నిందితులను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మం జిల్లాకు చెందిన కారు డ్రైవర్ యనగల నరేందర్(25) నిజాంపేట జర్నలిస్టు కాలనీలో ఉంటున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన విద్యార్థి కొంతం నితిన్(22) కూకట్‌పల్లి ఇంద్రహిల్స్ కాలనీలో ఉంటున్నాడు. ఇద్దరూ స్నేహితులు, గంజాయి మత్తుకు బానిసయ్యారు. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ సమీపంలో విక్రయించడానికి వచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద 1,182 గ్రాముల గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

మరో కేసులో 1.72 కిలోల గంజాయి..

హైదరాబాద్ సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): సీలేరు ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్న యువకుడిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. సరూర్‌నగర్ లెనిన్‌నగర్‌కు చెందిన అలంపల్లి నితీష్ సీలేరు వెళ్లి చిన్న మొత్తాల్లో గంజాయి తెచ్చి, నగరంలో ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్‌మెంట్ సిబ్బంది నిఘా పెట్టి మీర్‌పేట్‌లో కస్టమర్‌కు గంజాయి ఇచ్చేందుకు వచ్చిన నితిన్‌ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 1.72 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లిన ఆగంతకులు

హయత్‌నగర్ జూలై 8 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గుండ్లున్న గోలుసును ఆగంతకులు లాక్కెళ్లారు. ఈ ఘటన మంగళవారం రాత్రి కోహెడలో చోటుచేసుకుంది. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ స్వగృహ కాలనీలో నివాసముండే పశువుల నర్సమ్మ(65) రాత్రి 7గంటల సమయంలో కుమారుడు యాదగిరి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంది. ఆ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గోలుసుని లాక్కుని పారిపోయారు. గొలుసు తెగిపోవడంతో ఏడు బంగారు గుండ్లు సంఘటనా స్థలంలోనే పడిపోయాయి. మిగతా 47 గుండ్లను దుండగులు తీసుకువెళ్లారు.. సంఘటనా స్థలంలో లభించిన ఏడు బంగారు గుండ్లను హయత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం తులంనర గుండ్లు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.